రేపు ఆయూష్ చిన్నపిల్లల ఆస్పత్రి ప్రారంభం

ప్రజాశక్తి - గాలివీడు : మండల కేంద్రంలోని గేటు వద్ద ఏర్పాటు చేసిన ఆయూష్ చిన్నపిల్లల వైద్యశాలను ప్రారంభించనున్నట్లు డాక్టర్ మహేష్‌నాయక్ పేర్కొన్నారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ మండలంలో అన్ని రకాల వైద్యులున్నారని, చిన్న పిల్లల వైద్యులు అందుబాటులో లేకపోవడంతో ఇతర పట్టణాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఉందన్నారు. ఇలాంటి తరుణంలో వారి ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఆయూష్ చిన్నపిల్లల వైద్యశాలను ఏర్పాటు చేశామనిచెప్పారు. పెద్దమండ్యం మండలం, రామనాయక్ తండాకు చెందిన తాను కర్నూల్ మెడికల్ కళాశాలలో ఎంబిబిఎస్ చదివానని చెప్పారు. తమిళనాడులో ఎండిగా పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. ఎక్కడో, ఎవరికో సేవ చేసే బదులు మన మండలంలోని, మన ప్రజలకు సేవ చేసేందుకే తన తల్లిదండ్రులు కష్టపడి ప్రయోజకుడిని చేశారన్నారు. వారి ఆశీర్వాదాలతో పది మందికి సేవ చేయాలనే ఉద్దేశంతో డాక్టర్ కోర్సు పూర్తి చేసి ఆయూష్‌ను ఏర్పాటు చేశానని తెలిపారు. తమ ఆస్పత్రిలో అత్యవసర కేసులు 24 గంటలు చూస్తారని, ప్రతి మంగళవారం ఉచిత సేవలు అందిస్తామని చెప్పారు. పురిటి పిల్లల నుంచి 18 ఏళ్ల వయస్సు గల వారికి అన్ని రకాల వ్యాధులను చూస్తామన్నారు. అన్నమయ్య జిల్లాలోని గాలివీడు మండల ప్రజలందరూ తమ సేవలను పొందాలని కోరారు.

రాజంపేట : కేక్ కట్ చేస్తున్న రవికుమార్, అంగన్వాడీలు

అగాని పోరు

తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలంటూ అన్నమయ్య జిల్లాలో అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు చేపట్టిన నిరవధిక సమ్మె సోమవారం నాటికి 14వ రోజుకు చేరుకుంది. జిల్లా వ్యాప్తంగా ఉన్న ఐసిడిఎస్, తహశీల్దార్, ఎంపిడిఒ కార్యాలయాల ఎదుట అంగన్వాడీలు పెద్ద ఎత్తున ఆందోళనలు కొనసాగిస్తున్నారు. జగన్‌మోహన్‌రెడ్డి మంచి బుద్ధి ప్రసాదించాలని కోరుతూ క్రిస్మస్ పర్వదినం సందర్భంగా కేక్ కట్ చేసి అంగన్వాడీలు ప్రార్థనలు చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అంగన్వాడీలు మాత్రం సమస్యలు పరిష్కారమయ్యే వరకూ సమ్మె విరమించేది లేదంటూ నినాదాలు చేశారు. అంగన్వాడీల సమ్మెకు పార్టీలు, ప్రజలు, ప్రజా సంఘాల నుంచి సంపూర్ణ మద్దతు లభిస్తోంది.

- జగన్‌కు మంచి బుద్ధి ప్రసాదించాలని కోరుతూ క్రిస్మస్ ప్రార్థనలు
- 14వ రోజూ కొనసాగిన సమ్మె
- పార్టీలు, ప్రజల నుంచి పెరుగుతున్న మద్దతు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి మనసు మారి తమ న్యాయమైన కోర్కెలు తీర్చే విధంగా ఆయనకు మంచి బుద్ధి ప్రసాదించాలని కోరుతూ అంగన్వాడీలు ఏసుప్రభుకు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అంగన్వాడీల 14వ రోజు సమ్మెలో భాగంగా క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు రవికుమార్ ఆధ్వర్యంలో ఐసిడిఎస్ కార్యాలయం వద్ద కేక్‌కట్ చేసి ప్రార్థనలు చేసి నిరసన తెలిపారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు ఈశ్వరమ్మ, శివరంజని, సుజాత, విజయమ్మ పాల్గొన్నారు. **పీలేరు:**ప్రభుత్వం అంగన్వాడీల సమస్యలు పరిష్కరించి సమ్మె విరమణకు కృషి చేయాలని సిఐటియు, ఎఐటియుసి నాయకులు తెలిపారు. ఐసిడిఎస్ ప్రాజెక్ట్ కార్యాలయం ముందు అంగన్వాడీ కార్యకర్తలు, సహాయకులు కూర్చుని ప్రభుత్వ తీరును నిరసిస్తూ అసహనాన్ని వ్యక్తం చేశారు. ప్రభుత్వం దగ్గర డబ్బుల్లేవని, ఇప్పుడిది సమయం కాదని చెప్పడం ఏంటని అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ నాయకులు సుహాసిని, రూపారాణి, సరళ శారద ప్రశ్నించారు. కార్యక్రమంలో సిఐటియు, ఏఐటీయూసీ నాయకులు దనాసి వెంకటరామయ్య, నరసింహులు, అంగన్వాడీలు పాల్గొన్నారు. **మదనపల్లి :** అంగన్వాడీ ప్రాజెక్ట్ కార్యకర్తలు కేక్ కట్ చేసి నిరసన తెలిపారు. సిఐటియు ఉపాధ్యక్షులు పి.శ్రీనివాసులు, జిల్లా కోశాధికారి టి.హరింద్రనాథ్ శర్మ, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి రామానుజులు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి రామచంద్ర పాల్గొని నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా అంగన్వాడీ కార్యకర్తలు నిరవేదిక సమ్మెను 14 రోజులుగా చేస్తున్న ముఖ్యమంత్రి పట్టించుకోకపోవడంతో ఇకనైనా ఆయనకు మంచి బుద్ధి రావాలని కేక్ కట్ చేసి నిరసన తెలియజేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ నాయకులు మధురవాణి, రాజేశ్వరి, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మదనపల్లె : కేక్ కట్ చేసి తినిపిస్తున్న శ్రీనివాసులు

బి.కొత్తకోట : ప్రభుత్వం మొండి వైఖరిని విడనాడి అంగన్వాడీల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని తంబళ్లపల్లి నియోజకవర్గ టిడిపి నేత, ప్రముఖ పారిశ్రామికవేత్త దాసిరిపల్లి జయచంద్రారెడ్డి పేర్కొన్నారు. బి.కొత్తకోట ఐసిడిఎస్ కార్యాలయం ఎదుట అంగన్వాడీల సమ్మెకు మద్దతు తెలిపి మాట్లాడుతూ అంగన్వాడీలు విధులు నిర్వహించకపోవడం వల్ల రాష్ట్ర వ్యాప్తంగా గందరగోళ పరిస్థితులను నెలకొన్నాయని పేర్కొన్నారు. వారితో వెట్టిచాకిరి చేయించుకోవడం మానుకుని వారి న్యాయమైన డిమాండ్‌లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. రానున్న టిడిపి జనసేన ప్రభుత్వంలో అంగన్వాడి వర్కర్లకు న్యాయం జరుగుతుందని తెలియజేశారు. కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు ఆంజనేయరెడ్డి, మస్తాన్‌రెడ్డి శంకర్‌రెడ్డి, పట్టా చంద్రమోహన్‌రెడ్డి పాల్గొన్నారు. **చిట్వేలి:** ప్రభుత్వం అంగన్వాడీల సమస్యలు పరిష్కరించి వారికి న్యాయం చేయాలని రైల్వేకోడూరు తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జి కస్తూరి విశ్వనాధనాయుడు అన్నారు. అంగన్వాడీలు ఆయాలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిర్వహిస్తున్న సమ్మెకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్వాడీ కార్యకర్తలతో చర్చించి వారి న్యాయమైన సమస్యల పరిష్కారానికి కృషి చేయడం ఆపి కాలయాపన చేయడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. టిడిపి మండల అధ్యక్షుడు కె.కె.చౌదరి మాట్లాడుతూ మాట తప్పం మడిమతిప్పమంటూ పక్క రాష్ట్రాల్లో అంగన్వాడి కార్యకర్తలకు కల్పించే సదుపాయాలు, న్యాయమైన కోరికలు తీర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రముఖ పారిశ్రామిక వేత్త విశ్వేశ్వర నాయుడు, న్యాయవాదులు రెడ్డయ్య, బాలాజీ, వెంకటేష్ రాజు, షబ్బీర్, కరింబాష, మాచిన సుబ్బనాయుడు, కోటయ్య, తుంగ సుబ్బ నాయుడు, పగడాల వెంకటేశ్వర్లు, మోసాటి హరి, అదుతే కుమార్, ఐసిడిఎస్ సుధామణి, సుజాత, కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

బి.కొత్తకోట : అంగన్వాడీలకు మద్దతు తెలుపుతున్న టిడిపి నాయకులు

పీలేరు : నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు

క్రిస్మస్ వేడుకల్లో సిఎం జగన్

ప్రజాశక్తి-పులివెందుల టౌన్

రాష్ట్రంలోని ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. మూడు రోజుల జిల్లా పర్యటనలో సోమవారం పులివెందులలోని సిఎస్ఐ చర్చిలో తల్లి వైఎస్ విజయమ్మ, సతీమణి వైఎస్ భారతి, ఇతర కుటుంబ సభ్యులతో కలిసి ప్రార్థన కూటమిలో జగన్ పాల్గొన్నారు. అనంతరం సిఎస్ఐ చర్చిలో తల్లి విజయమ్మతో కలిసి క్రిస్మస్ కేకు కట్ చేశారు. జగన్‌కు తల్లి విజయమ్మ కేక్‌ను తినిపించారు. సిఎస్ఐ చర్చి ఆధ్వర్యంలో నూతన సంవత్సర క్యాలెండర్లను ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. ప్రార్థనా కూటములు ముగిసిన అనంతరం చర్చిలో ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి ఒక్కరికీ క్రిస్మస్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. కుటుంబ సభ్యులతో కలిసి క్రిస్మస్ పండుగ వేడుకలో పాల్గొన్న జగన్ బంధువులు, స్నేహితులు, ఆప్తులు, అభిమానులకు క్రిస్మస్ పర్వదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రిస్మస్ పండుగ రోజున ప్రతి ఏడాది తన సొంత గడ్డపై ఇదే చర్చిలో కుటుంబ సభ్యులు, బంధుగణం, స్నేహితులతో కలిసి పండుగ వేడుకలో పాల్గొనడం తన మనసుకు ఎంతో ఆనందాన్నిచ్చిందని సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి ఆదిమూలపు సురేష్, ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాషా, కడప ఎంపీ అవినాష్‌రెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, కడప మేయర్ సురేష్‌బాబు, వైఎస్ ప్రకాష్‌రెడ్డి, వై.ఎస్ మనోహర్‌రెడ్డి, పాడా ఒఎస్‌డి అనిల్‌కుమార్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, ప్రజాప్రతినిధులు, చర్చి పాస్టర్లు పాల్గొన్నారు. మైదుకూరులో జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ మదీనా కుమారుడి వివాహానికి హాజరై నూతన వధువరులను ఆశీర్వదించారు. పులివెందులలో కూడా నవదంపతులను ఆశీర్వదించారు. సిఎస్ఐ చర్చిలో ప్రార్ధనా కూటములు ముగించుకొని భాకారపురం హెలిప్యాడ్ నుంచి మైదుకూరుకు వెళ్లి అక్కడి నుంచి మళ్లీ కడపకు చేరుకుని ప్రత్యేక విమానంలో విజయవాడకు బయలుదేరి వెళ్లారు.

క్రిస్మస్ వేడుకల్లో కేక్ కట్ చేస్తున్న సిఎం జగన్, విజయమ్మ

హామీలు అమలు చేయాల్సిందే

కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న ఎస్ఎస్ఎ ఉద్యోగులు

6వ రోజూ కొనసాగిన ఎస్ఎస్ఎ ఉద్యోగుల సమ్మె

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

సమగ్రశిక్షలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని, హామీలను అమలు చేయాలని కోరుతూ ఈ నెల 20 నుంచి చేపట్టిన నిరవధిక సమ్మె సోమవారం 6వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమగ్ర శిక్ష ఉద్యోగులను విద్యాశాఖలో విలీనం చేసి రెగ్యులర్ చేయడమే కాకుండా సమాన పనికి సమాన వేతనం అందజేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిన నాడు-నేడు నుంచి పిల్లలకు చదువులకు అవసరమయ్యే అమ్మఒడి, జగనన్న విద్యా కానుక, మధ్యాహ్న భోజనం, యూడైస్ తదితర వాటిని ఎప్పటి కప్పుడూ ప్రభుత్వం నిర్దేశించిన సమయాల్లో విధులను పూర్తి చేస్తున్నామన్నారు. రూ.10 లక్షల రిటర్మెంట్ బెనిఫిట్‌తో కూడిన గ్రాట్యూటీ కల్పించాలని పేర్కొన్నారు. ఉద్యోగ భద్రత కల్పించాలని, ఇపిఎఫ్, ఇఎస్ఐ కార్డు సదుపాయాన్ని కల్పించాలన్నారు. ఉద్యోగ విరమణ వయస్సు 62కు పెంచాలని కోరారు. రాష్ట్ర జెఎసి పిలుపు మేరకు 6వ రోజు ఖాళీ ప్లేట్లతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పిఆర్‌టియు రాష్ట్ర క్రమ శిక్షణ సంఘం చైర్మన్ కొండూరు శ్రీనివాస రాజు, సీనియర్ నాయకులు ఎం.ఒబుల్‌రెడ్డి, రామాపురం మండల ప్రెసిడెంట్ ఎ.రామచంద్ర, సంబేపల్లి మండల ప్రెసిడెంట్ జి.రెడ్డెన్న, వైస్ ప్రెసిడెంట్ కె.కులశేఖర్ రెడ్డి, సంబేపల్లి మండల ఎస్‌టియు నాయకులు వెంకటేశ్వర రెడ్డి, వీరబల్లి మండల పిఆర్‌టియు ప్రెసిడెంట్ నరసింహారెడ్డి, జయచంద్ర రాజు, యుటిఎఫ్ సుండుపల్లి మండల ప్రెసిడెంట్, వైస్ ప్రెసిడెంట్ సమగ్ర శిక్ష ఉద్యోగులు చేపడుతున్న సమ్మెలో పాల్గొని మద్దతు ప్రకటించారు.

విద్యుత్ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలి : సిపిఎం

ప్రజాశక్తి-మదనపల్లి

వాల్మీకిపురం పట్టణంలో విద్యుత్ షాక్‌తో మరణించిన నాగరాజు కుటుంబాన్ని ఆదుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. సోమవారం మదనపల్లి పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యుత్ అధికారుల నిర్లక్ష్యానికి నిండు ప్రాణం బలైందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు తమ తప్పు కప్పిపుచ్చుకోవడానికి అధికార పార్టీ, స్థానిక ఎమ్మెల్యే ద్వారా పోలీసులు మీద ఒత్తిడి తెచ్చి కేసు నమోదు లేకుండా చనిపోయిన నాగరాజు కుటుంబాన్ని ఆదుకోవడానికి ఎలాంటి ప్రయత్నాలు చేయకుండా వ్యవహరించడం సిగ్గుచేటని పేర్కొన్నారు. విద్యుత్ షాక్‌తో మరణించిన ఎవరికైనా ట్రాన్స్‌కో రూ.ఐదు లక్షల ఎక్స్ గ్రేషియా చెల్లించాలని నిబంధన ఉందని దీనిని కూడా నాగరాజు కుటుంబానికి దక్కకుండా చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనధికారికంగా 10 ఏళ్ల పనులు చేయించుకుంటూ లైన్ క్లియర్ తీసుకున్న వాల్మీకిపురం ట్రాన్స్‌కో ఎఇ నిర్లక్ష్యం కారణంగానే ట్రాన్సుఫార్మర్ మరమ్మతులో నాగరాజు విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడని తెలిపారు. వాల్మీకిపురం ప్రభుత్వ ఆసుపత్రి నుండి పోలీసులకు డెత్ ఇంటిమేషన్ వెళ్లినా ఎందుకని కేసు నమోదు చేయలేదని ప్రశ్నించారు. పోలీసులు, విద్యుత్ అధికారులు కుమ్మక్కయి నాగరాజు కుటుంబాన్ని ద్రోహం చేశారని పేర్కొన్నారు. ప్రభుత్వ పెద్దలు స్పందించి విద్యుత్ షాక్‌తో మృతి చెందిన ఘటనపై సమగ్ర విచారణ జరిపించాలని బాధ్యులపై కఠిన చర్యలు తీసుకొని బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. సిపిఎం తరపున నాగరాజు కుటుంబానికి అండగా నిలుస్తామని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.

నిరసన తెలుపుతున్న ప్రజాసంఘాల నాయకులు

మానవ హక్కులను కాపాడుకోవాలి

ప్రజాశక్తి-పీలేరు

మానవ హక్కులను కాపాడుకోవాల్సిన బాధ్యత అందిరపై ఉందని ప్రజాసంఘాల నాయకులు తెలిపారు. సోమవారం పీలేరు ప్రజాసంఘాల నాయకుల ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ కూడలిలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించి, మానవహక్కులను మసి చేసిన మనుస్మృతి ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా మాలమహానాడు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తుమ్మల ధరణ్ కుమార్, భారతీయ అంబేద్కర్ సేన జిల్లా కో-కన్వీనర్ పాలకుంట శ్రీనివాసులు, ముస్లిం జెఎసి నాయకులు పఠాన్‌మౌల, బిసి హక్కుల పోరాట సమితి జిల్లా నాయకులు ఎద్దుల మహేష్ యాదవ్, ఎంఎస్‌పి పీలేరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి గండికోట వెంకటేష్ మాట్లాడుతూ నూటికి 90 శాతంగా వుంటున్న మెజారిటీ సమూహాలకు, మహజన సమాజాలకు చెందిన ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనారిటీ మహిళలు, ఇతర అణగారిన వర్గాల ప్రజానీకం సహా నూటికి 98 శాతంగా వుంటూ నాడు శూద్ర వర్ణంగా, నిమ్న జాతి వర్గంగా పిలుచుకోబడి నేడు అదే వర్ణం, వర్గం మెజారిటీ సమూహంగా, మహజన సమాజంగా గౌరవప్రదంగా పిలుచుకుంటున్నారని పేర్కొన్నారు. రాబోవు కాలంలో మహనీయుల కలలను సాకారం చేసే చారిత్రక చర్యల్లో భాగంగా ఈ గొప్ప తీర్మానానికి ప్రతి ఒక్కరూ కంకణబద్ధులై త్రికరణ శుద్ధితో ముమ్మాటికీ ప్రతిజ్ఞ పూనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ముస్లిం జెఎసి నాయకులు షేక్ అమీరుల్లా, మేముసైతం సమాజం కోసం వ్యవస్థాపకులు షేక్ షాహిన్షా, బిఎస్‌పి పీలేరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి చీకటిపల్లి ఎర్రప్ప, మాలమహానాడు సీనియర్ నాయకులు కె.గట్టప్ప, బాస్ జిల్లా నాయకులు ముల్లంగి కృష్ణయ్య, జాతీయ అంబేద్కర్ సేవా సంఘం పీలేరు మండల అధ్యక్షులు చీకటిపల్లి మల్లికార్జున, జిల్లా అధికార ప్రతినిధి మచ్చా రెడ్డయ్య, ఎంఆర్‌పిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, చరణ్ కుమార్, రాజేష్, ప్రణీత్, బిసి నాయకులు చింతగింజల అశోక్ కుమార్, మస్తాన్ వల్లి, మాలమహానాడు పీలేరు మండల ప్రచార కార్యదర్శి దప్పేపల్లి అనంద్, కార్యవర్గ సభ్యులు గుర్రం లోకనాధం, గుండ్లురు నాగేంద్ర, కుడితి మహేష్ పాల్గొన్నారు.

బస్టాండ్‌లో కుంగిన రోడ్డు

ప్రజాశక్తి-చిన్నమండెం

స్థానిక బస్టాండ్ దగ్గర పైపులైను కుంగిపోయి భూమి లోపలికి పెద్ద గొయ్యి ఏర్పడింది. ప్రయాణికులకు, వాహనాల రాకపోకలకు అంతరాయం కలగకుండా ఎస్ఐ డి.రమేష్ బాబు వెంటనే స్పందించి గుంతను పూడ్చివేశారు. స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

ప్రజావేదికపై మాట్లాడుతున్న బత్యాల చెంగల్రాయులు

చంద్రబాబుతోనే 'భవిష్యత్తుకు గ్యారంటీ' : 'బత్యాల'

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

చంద్రబాబు నాయుడుతోనే భవిష్యత్తుకు గ్యారంటీ అని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బత్యాల చెంగల్రాయులు అన్నారు. తెలుగు యువత అసెంబ్లీ ఆర్గనైజింగ్ కార్యదర్శి గగ్గుటూరి హుమయున్ ఆధ్వర్యంలో సోమవారం మన్నూరులోని 26, 27వ వార్డులలో టిడిపి, జనసేన నాయకులు నిర్వహించిన బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బత్యాల, జనసేన పార్టీ సమన్వయకర్త అతికారి దినేష్ భారీ గజమాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం టిడిపి నాయకులు, కార్యకర్తలతో కలిసి వార్డులో పర్యటించి భవిష్యత్తుకు గ్యారంటీపై అవగాహన కల్పించారు. వీధి వీధినా బాణాసంచా పేలుస్తూ, పూలు వెదజల్లుతూ డిజేలతో ప్రజలు జననిరాజనం పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రజా వేదిక బహిరంగ సభలో బత్యాల మాట్లాడుతూ అన్నదాత పథకం కింద ఆంధ్రప్రదేశ్‌లోని ప్రతి రైతుకు ఏడాదికి రూ.20 వేలు ఆర్థిక సహాయం, తల్లికి వందనం, మహాశక్తి, దీపం, మహిళల ఉచిత బస్సు ప్రయాణం, బీసీల రక్షణ చట్టం, ఇంటింటికీ మంచి నీరు, ఐదేళ్లలో పేదల ఆదాయాన్ని రెట్టింపు చేసి పూర్ టు రిచ్ నినాదంతో పేదలను సంపన్నులు చేయడం వంటి అనేక పథకాలు గురించి వివరించారు. అతికారి దినేష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలు టిడిపి-జనసేన నాయకత్వాన్ని కోరుకుంటున్నారని, ఇందుకు నిదర్శనం విజయవాడలో జరిగిన యువగళం ముగింపు సభకు భారీగా తరలివచ్చిన జన సందోహమే నిదర్శనమని తెలిపారు. రానున్న ఎన్నికలలో టిడిపి, జనసేన ప్రభంజనాన్ని వైసిపి తట్టుకోలేదన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, పదాధికారులు, జనసేన నాయకులు, కార్యకర్తలు, వీర మహిళలు పాల్గొన్నారు.

గ్రానైట్ తవ్వకాల లీజును రద్దు చేయాలి

ప్రజాశక్తి-సుండుపల్లి

మండలంలోని ఎర్రమనేని పాలెం పంచాయతీ నల్ల మేకలపల్లెలో ఎస్ఎస్ గ్రానైట్ వారు తవ్వకాలు ప్రారంభించారని, దీని వల్ల తమకు తీవ్ర ఇబ్బందిగా ఉందని, ప్రభుత్వం వెంటనే లీజును రద్దు చేసి తమ ప్రాణాలు కాపాడాలని రైతులు కోరుతున్నారు. సోమవారం వారు సుండుపల్లె మండలం ఎర్రమనేనిపాలెం గ్రామపంచాయతీ నల్ల మేకల పల్లెలో ప్రభుత్వం లీజుకు కేటాయించిన ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ గ్రామసభ ఆమోదం లేకుండానే మైనింగ్ శాఖ వారు ఏ విధంగా మైనింగ్ తవ్వకాలకు లీజు అనుమతులు ఇస్తారని ప్రశ్నించారు. ప్రజల అభిప్రాయం సేకరించకుండానే ఇష్టానుసారంగా లీజుకు కేటాయించిన అధికారులను పైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పచ్చని పంట పొలాలు వేసుకున్న పక్కనే మైనింగ్ కార్యకలాపాలు చేయడంతో వచ్చేటువంటి దుమ్ము దూళితో పంటలు నాశనమవుతాయని వాపోయారు. బలమైన శబ్దాలతో బాంబులు పేల్చడంతో ఆ ప్రాంతంలో ఉండేటువంటి ఇళ్లు పగుళ్లు ఏర్పడుతాయని చెప్పారు. దీంతో గ్రామ ప్రజలు తీవ్ర భయభ్రాంతులకు గురవుతారని, వెంటనే లీజును రద్దు చేసి రైతులను ఆదుకోవాలని కోరారు. శబ్ద, వాయు కాలుష్యంతో ఆ ప్రాంతాలలోని పశువులు సైతం అనారోగ్యం పాలై ఇబ్బందులు పడుతున్నాయని, ప్రజలకు అసౌకర్యంగా ఉండేటువంటి లీజును తక్షణమే రద్దు చేయకపోతే ప్రజా పోరాటాలకు సిద్ధమవుతామని హెచ్చరించారు.

సమన్వయ కమిటీ సమావేశాన్ని జయప్రదం చేయండి

ప్రజాశక్తి-ములకలచెరువు

మండలంలో మంగళవారం నిర్వహించే తెలుగుదేశం పార్టీ సమన్వయ సమావేశాన్ని జయప్రదం చేయాలని టిడిపి మండల కన్వీనర్ పాలగిరి సిద్ద అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో మధ్యాహ్నం మూడు గంటలకు తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమన్వయ సమావేశం నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి తంబళ్లపల్లె నియోజకవర్గ ఇన్‌ఛార్జి శంకర్ యాదవ్ పాల్గొంటారన్నారు. మండలంలోని క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌ఛార్జులు, గ్రామ కమిటీ నాయకులు, మాజీ ప్రజా ప్రతినిధులు, సర్పంచులు, ఎంపిటిసిలు, జడ్‌పిటిలు, తెలుగు యువత, నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

సిబ్బంది పనితీరుపై ఆరా తీస్తున్న ఎమ్మెల్యే చింతల

మెరుగైన వైద్యం అందించాలి : 'చింతల'

ప్రజాశక్తి-వాల్మీకిపురం : ప్రభుత్వాసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించాలని పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. సోమవారం స్థానిక ప్రభుత్వాసుపత్రిని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింతల మాట్లాడుతూ ప్రభుత్వాసుపత్రికి వచ్చే రోగికి మెరుగైన వైద్యంతో పాటు రోగితో స్నేహపూర్వకంగా మెలగాలన్నారు. రోగుల పట్ల ప్రేమాభిమానులు చూపితే వారికి వైద్యం కన్నా మనం చూపించే ప్రేమాభిమానాలే రోగాలను తగ్గిస్తాయన్నారు. సిఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి నిరుపేదల వైద్యం కోసం వేల కోట్లు ఖర్చు చేస్తున్నారని కొనియాడారు. ఆరోగ్యశ్రీ, విలేజ్ క్లినిక్, ఆరోగ్య సురక్ష, 108, 104 ద్వారా ఉచిత వైద్య సేవలు అందిస్తుండడంతో పాటు ఆరోగ్యశ్రీ లేని వారికి సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా వైద్య ఖర్చులను అందిస్తున్నారన్నారు. 50 పడకల ఆసుపత్రి కూడా త్వరలోనే అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. అనంతరం ఎక్స్‌రే, ఈసీజీ, గర్భవతులు, మహిళలు, పురుషుల వార్డులను పరిశీలించి, వైద్య సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శివాని, నాయకులు చింతల ఆనంద రెడ్డి, కేశవ రెడ్డి, నీళ్లభాస్కర్, అబ్దుల్ కలీమ్, కువైట్ శంకరాచారి, మానవతా సంస్థ జిల్లా అధ్యక్షులు క్రిష్ణమూర్తి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సొమ్మొకరిది.. సోకొకరిది అన్నట్లుంది జగన్ వైఖరి : పిసిసి

ప్రజాశక్తి - వేంపల్లె : సొమ్మొకరిది.. సోకొకడిది అన్నట్లుంది సిఎం జగన్ వైఖరి అని సోకు ఒక్కడిది అన్నట్లుంది జగన్ వైఖరి అని పిసిసి మీడియా చైర్మన్ ఎన్.తులసిరెడ్డి విమర్శించారు. స్థానికంగా సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పులివెందుల నియోజకవర్గ అభివృద్ధిలో సింహభాగం కాంగ్రెస్ పాలనలో జరిగిందన్నారు. జెఎన్‌టియు, ట్రిపుల్‌ఐటి, అంతర్జాతీయ పరిశోధన కేంద్రం, శిల్పారామం, భూగర్భ డ్రెయినేజీ, రింగు రోడ్డు, పులివెందుల-కడప నాలుగు వరుసల రోడ్లు, ప్రతి గ్రామంలో సిమెంట్ రోడ్లు, పైడిపాళెం రిజర్వాయర్, లింగాల కెనాల్, గండికోట, సిబిఆర్ ఎత్తిపోతల పథకంతోపాటు పలు అభివృద్ధి పనులు కాంగ్రెస్ పాలనలో జరిగాయన్నారు. వీటిని జగన్ తన ఖాతాలో వేసుకోవడం శోచనీ యమన్నారు. జగన్ పాలనలో పులివెందుల ప్రజలకు రక్షణ కరువైందని ఆరోపించారు. వివేకానందరెడ్డి హత్య జరిగి నాలుగేళ్లయినా ఇంత వరకు పురోగతి లేదని విమర్శించారు. సిఎం జగన్ కుటుంబ సభ్యులకే రక్షణ లేదన్నారు. నియోజక వర్గంలో మద్యం, జూదం వంటి అసాంఘిక కార్యకలా పాలు జోరుగా జరుగుతున్నట్లు చెప్పారు. పులివెందుల అసాంఘిక కార్యకలా పాలకు అడ్డాగా మారిందన్నారు. జగన్ పాలనలో ట్రిపుల్‌ఐటి నిధుల్లేక వెలవెలబోతున్నట్లు తెలిపారు. నియో జకవర్గంలో ప్రధానమైన వేంపల్లె-రాయచోటి రోడ్డు ప్రయాణికులకు భూలోకంలో యమలోకం చూపిస్తోందన్నారు. పులివెందులలో జగనన్న కాలనీలో 7073 గృహాలు మంజూరు కాగా 5 ఇళ్లు మాత్రమే పూర్తయ్యాయని తెలిపారు.

విజేతగా నిలిచిన బజరంగి బుల్స్ జట్టు

ముగిసిన కబడ్డీ పోటీలు

ప్రజాశక్తి - బి.కొత్తకోట

పట్టణంలో హోరాహోరీగా సాగిన మండల కబడ్డీ పోటీలలో మండలంలోని యువ క్రీడాకారులు సత్తా చాటారు. స్థానిక కబడ్డీ కోచ్ బండి కార్తీక్ బాబు నేతృత్వంలో ఈ పోటీలు నిర్వహించారు. బజరంగి బుల్స్ జట్టు ఫైనల్ పోటీలో గెలిచి విజేతగా నిలిచింది. కబడ్డీ పోటీల నిర్వహణ ద్వారా యువతలోని ప్రతిభను వెలికి తీసిన ఆర్గనైజర్ ఉస్మాన్‌ను ప్రజలు అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఉస్మాన్ మాట్లాడుతూ ప్రస్తుతం కబడ్డీ క్రీడకు విపరీతమైన క్రేజ్ పెరిగిందన్నారు. ప్రస్తుతం జరుగుతున్న ప్రో కబడ్డీ లీగ్ కబడ్డీ క్రీడాకారులకు కాసుల వర్షం కురిపిస్తోందన్నారు. కబడ్డీ క్రీడాకారులు తమకు అందివచ్చిన అవకాశాలని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం విన్నర్స్, రన్నర్స్ టీములకు ట్రోఫీలతోపాటు పతకాలను అందజేశారు.

పిల్లలకు భోజనం వడ్డిస్తున్న నాగార్జున

అన్నదానం గొప్పది

ప్రజాశక్తి-వీరబల్లి

క్రిస్మస్ ఉత్సవాలలో భాగంగా డి.రాచపల్లి పంచాయతీ పెద్దమాదిగపల్లెలో గుదే నాగార్జున ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అన్నదాన కార్యక్రమంలో పాల్గొని స్వయంగా ఆయనే వడ్డించారు. ముందుగా ప్రత్యేక ప్రార్థన సమావేశం నిర్వహించారు. కేక్ కట్ చేసి ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఘనంగా క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నదానం గొప్పదని తెలిపారు. కార్యక్రమంలో ఫాదర్ జాన్సన్, బ్రదర్ కళ్యాణ్, సిస్టర్ శ్రావణి, టిడిపి వాణిజ్య విభాగ కార్యదర్శి చెన్నూరు పవన్, రామ్మోహన్, కిరిటప్ప, కదరమ్మ, ఎల్లయ్య, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

తాగునీటి బోరుకు మరమ్మతు చేయిస్తున్న సర్పంచ్ నాగార్జున

స్కీమ్ బోరుకు మరమ్మతులు

ప్రజాశక్తి-వీరబల్లి

మండలంలోని మట్లి గ్రామం గంగాపురంలో కొన్ని రోజులుగా ప్రభుత్వ తాగునీటి స్కీం బోరు దెబ్బ తినడంతో సర్పంచ్ సోమారపు నాగార్జున చారి స్థానికులతో కలిసి సోమవారం మరమ్మతులు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల స్కీం బోరు దెబ్బతిందని తమ దృష్టికి వచ్చిందన్నారు. ప్రజల దాహార్తి సమస్యను పరిష్కరించేందుకు వెంటనే మరమ్మతులు చేయించామన్నారు. గ్రామంలో ప్రజలకు అందుబాటులో ఉంటూ గ్రామ అభివృద్ధికి అహర్నిషలు కృషి చేస్తామన్నారు. సమస్య ఉందని సర్పంచ్ దృష్టికి వెళ్లగానే తక్షణమే స్పందించి మరమ్మతులు చేయించిన వారికి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో గుదే నాగార్జున, పుల్లగూర చెన్నకేశవులు, రాపూర్ రఘురామ, ఉప్పుతోళ్ల సాయిప్రసాద్, వల్లపు రమణ, కత్తి రామకృష్ణ, స్వామి పాల్గొన్నారు.

కేక్ కట్ చేస్తున్న పోతుల సాయినాథ్

'పోతుల' జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-ములకలచెరువు

జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి పోతుల సాయినాథ్ పుట్టిన రోజు వేడుకలను స్థానిక మూడు రోడ్ల కూడలిలో ఘనంగా నిర్వహించారు. భారీ కేక్ కట్ చేసి ప్రజలకు పంచారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు పాలగిరి సిద్ధ, మాజీ మార్కెట్ చైర్మన్ రమణప్ప, నియోజకవర్గ యువత నాయకులు చెన్నకృష్ణ, తంబళ్లపల్లి జనసేన మండల ఉపాధ్యక్షులు సుంకా లక్ష్మణ, సీనియర్ నాయకుడు పవన్‌రెడ్డి తనకల్లు ఎంపిటిసి అమర్ కార్తికేయ, మదనపల్లి పట్టణ ప్రధాన కార్యదర్శి కిరణ్ కుమార్‌రెడ్డి, జనసేన సీనియర్ నాయకులు జెసిపి శ్రీనివాసులు, షోరూం సూరి, మండల కమిటీ నాయకులు అంజి, కోటప్ప, మహేష్ ,రాజశేఖర్ , పవర్ ఆఫ్ ద టీం అధ్యక్షులు గుమ్మిశెట్టి గోపాలకృష్ణ, టీం ఉపాధ్యక్షులు రామిశెట్టి నాగరాజు, ప్రచార కార్యదర్శి వినయ్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

సంక్షేమం కోసం కృషి చేయాలి

పద్మశాలీయ ఉద్యోగ సంక్షేమ సంఘం అధ్యక్షులు డాక్టర్ శ్రీనివాసులు

ప్రజాశక్తి- కడప అర్బన్

ఉద్యోగుల సంక్షేమం కోసం కృషి చేస్తామని పద్మశాలీయ ఉద్యోగ సంక్షేమ సంఘం అధ్యక్షులు డాక్టర్ శ్రీనివాసులు అన్నారు. సోమవారం మద్రాసు రోడ్డు చిన్నచౌకు పద్మశాలీయ భవన్‌లో పద్మశాలీయ ఉద్యోగ సంక్షేమ సంఘం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. 2024 నూతన సంవత్సర వార్షిక క్యాలెం డర్, డైరీల ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. సంఘ కార్యకలాపాల గురించి, భవిషత్ కార్యాచరణ గురించి మాట్లాడుతూ ఉద్యోగులందరూ సమా జంలో సేవలు అందిస్తూ, సంఘం సంక్షేమం కోసం కృషి చేయాలన్నారు. సంఘం ద్వారా నడుస్తున్న ఉచిత పరిణయ వేదిక, ఉద్యోగ సమాచారం అంద రికి ఉపయోగపడుతున్నాయన్నారు. సంఘం గౌరవ అధ్యక్షులు ప్రభుత్వ పురుషుల కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ గాజుల రవీంద్రనాథ్ మాట్లాడుతూ సంఘం ప్రతి ఉద్యోగికీ వృత్తిరీత్యా ఎదురయ్యే సమస్యలలో తోడుగా ఉంటుందన్నారు. సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షులు సోము జ్ఞానశంకర్ సంఘం రిటైర్డ్ ఉద్యో గులకు పెన్షన్స్ ఇతర సమస్యలకు సమాధానం ఇస్తుందన్నారు. 2024 నూతన సంవ త్సర కేలండర్ డైరీ ఆవిష్కరణ పద్మశాలీయ సేవా భవన్ అధ్యక్షుడు అవ్వారు సుబ్బరాయుడు, రిటైర్డ్ లెక్చరర్ డాక్టర్ మామిల్ల వెంకటసుబ్బయ్య చేతుల మీదుగా నిర్వహించారు. ఉచిత పరిణయ వేదిక కన్వీనర్ బీవీ సుబ్బరాయుడు, గునిశెట్టి సాయి పాల్గొన్నారు.

స్పందన కరువు

- రోడ్లపై మురుగునీరు
- దారిలేకుండా రోడ్డుపై చెట్టుకొమ్మలు
- పట్టని పంచాయతీ అధికారులు
- స్పందనలో పెట్టినా పట్టని వైనం
- నిర్లక్ష్యంగా జిల్లా యంత్రాంగం

రోడ్డుపై ప్రవహిస్తున్న ముగరు నీరు

ప్రజాశక్తి-వాల్మీకిపురం

రోడ్డుపై మురుగునీరు ప్రవహిస్తుండడంతో ప్రజలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలోని కొత్తఇందిరమ్మ కాలనీ వద్ద గత రెండు నెలలుగా రోడ్డుపై మురుగునీరు ప్రవహిస్తుండడంతో రోడ్డు గుంతగా మారుతుండడంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని మండిపడుతున్నారు. అంతే కాకుండా పంచాయతీ రోడ్డుపై చెట్టుకొమ్మలు, ఇంటి కొళాయి వేసి దారి లేకుండా ఇండ్ల పక్కన వాళ్లకు ఇబ్బంది కలిగిస్తున్నారని, పంచాయతీ అధికారులు ఏ మాత్రం పట్టించుకోకపోవడం సిగ్గుచేటని ప్రజలు మండిపడుతున్నారు. రోడ్డుపైప్రవహిస్తున్న మురుగునీరు మదనపల్లి-తిరుపతి జాతీయ రహదారిపైకి వస్తుండడంతో వాహనదారులు సైతం తీవ్ర ఇబ్బందులకు గురి కావాల్సిన పరిస్థితి ఏర్పడింది. రోడ్డు శుభ్రం చేయాలని పంచాయతీ మేస్త్రీకి చెప్పినా పట్టించుకోలేదని, ఉన్నతాధికారులు సైతం నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ప్రజలు మండిపడుతున్నారు. స్పందనలో పెట్టినా.. అధికారులు ఫోన్ చేసి సంతకం చేయాలని అడుగుతున్నారే.. తప్ప మీ సమస్య ఏంటి అని అడిగే నాథుడే కరువయ్యారని ప్రజలు తీవ్రంగా విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా యంత్రాంగం నిద్రమేల్కొని ప్రజల సమస్యలపై సత్వరం చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

రాజంపేట : చిన్నారికి కేకు తినిపిస్తున్న జగన్‌మోహన్‌రాజు

క్రిస్మస్ సందేశాన్ని అందిస్తున్న దైవ సేవకులు తిమోతి

ప్రజాశక్తి - యంత్రాంగం

జిల్లాలో సోమవారం క్రిస్మస్ పర్వదినాన్ని క్రైస్తవులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని చర్చిలు, ప్రార్థనా మందిరాల్లో సామూహిక ప్రార్థనలు చేశారు.

పీలేరు : పట్టణం, పరిసరాల్లోని ప్రార్థనా మందిరాల్లో క్రైస్తవ సోదరీ, సోదఃరులు క్రిస్మస్ వేడుకలను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. సోమవారం క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని చర్చి ఫాదర్‌లు మాట్లాడుతూ ఏసు ప్రభువు జీవితం ఎందరికో ఆదర్శనేయమని అన్నారు. దేవుని కుమారుడిగా భువికి దిగివచ్చిన ఏసుక్రీస్తు తన బోధనలతో మానవాళిని సన్మార్గం వైపు నడిచేలా దిశా, నిర్దేశం చేశారన్నారు. ఈ సందర్భంగా భక్తులందరూ ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొని పరస్పరం ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. **రాజంపేట అర్బన్ :** ప్రపంచ మానవాళికి శాంతి, స్వేచ్ఛ, ప్రేమ, దయా మార్గాలను చూపిన కరుణామయుడు యేసుక్రీస్తు అని టిడిపి రాజంపేట పార్లమెంట్ అధ్యక్షులు చమర్తి జగన్ మోహన్ రాజు అన్నారు. భవాని నగర్ చర్చిలో క్రిస్మస్ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో పలువురు టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఆర్ఎస్ రోడ్డులోని చర్చిలో గంటా నరహరి కుటుంబ సభ్యులతో కలిసి ప్రార్థనలు చేశారు. పాస్టర్ కరుణాకర్, చైర్మన్ జాన్‌ప్రభాకర్ కోరిక మేరకు కమ్యూనిటీ హాల్ ఏర్పాటుకు నరహరి హామీ ఇచ్చారు. అనంతరం కేక్ కట్ చేసి క్రిస్మస్ శుభకాంక్షలు తెలియజేసి చీరలు పంపిణీ చేశారు. **నిమ్మనపల్లి :** క్రైస్తవ సోదరులు ఏసుక్రీస్తు జన్మదినాన్ని పురస్కరించుకొని క్రిస్మస్ పండుగను వెంకోజీగారిపల్లి, నిమ్మనపల్లి, గుండ్లబురుజు, రాచవేటివారిపల్లి, రెడ్డివారిపల్లి, బండ్లపై, ముష్టూరు, అగ్రహారం, సామకోటవారిపల్లి, వెంగంవారిపల్లి, ఎగువ మాచిరెడ్డిగారిపల్లి, దిగువ మాచిరెడ్డిగారిపల్లి తదితర ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించారు. పాస్టర్లు జయకుమార్, బాబు, రాజు బైబిల్ లోని అంశాలను భక్తులకు బోధించారు. **గాలివీడు :** ప్రజల పాపముల నుండి రక్షించడానికి యూదుల రాజుగా ఏసుక్రీస్తు ప్రభువు జన్మించాడని దైవ సేవకులు తిమోతి పేర్కొన్నారు క్రిస్మస్ పర్వదిన సందర్భంగా కర్మెల్ ప్రార్థన మందిరంలో ఏర్పాటు చేసిన క్రిస్మస్ సందేశాన్ని ఇచ్చారు. పి.కె.పల్లి వెంకటేష్ ఐదు కేజీల క్రిస్మస్ కేకును కట్ చేశారు. అనంతరం పిల్లలకందరికి పంచిపెట్టారు. క్రిస్మస్ పర్వదిన సందర్భంగా ప్రజలందరూ కానుకలు స్వీట్స్ పండ్లు పలాలు అందరికీ ప్రేమ విందును కూడా సమకూర్చారు. కార్యక్రమంలో బాధ్యత గల సహోదరుడు రత్న కుమార్, నూలివీడు, అరవీడు, గేటు ఐఎఫ్‌సి చర్చిలలో పాస్టర్ డేవిడ్ రాజు పలువురు క్రిస్మస్ సందేశాన్ని అందించారు. మండల ప్రజలు క్రిస్మస్‌ను ఘనంగా జరుపుకున్నారు. పిల్లలు పెద్దలు అందరూ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. **కలకడ :** క్రిస్మస్ వేడుకలను క్రైస్తవ సోదరులు భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. తమ చర్చిలలో ప్రార్థనలు నిర్వహించుకుని పాస్టర్ చెప్పే నీతి వాక్యాలను విని గేయాలు పాడుకుని అంగరంగ వైభవంగా తమ ఆలయాలను విద్యుత్ విపారాధన అలంకరించుకుని ప్రార్థనలు చేసుకున్నారు. **రామాపురం :** మండలంలో కిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. స్థానిక ఆర్‌సిఎం చర్చితో పాటుగా లక్కిరెడ్డిపల్లి రహదారిలోనే ఉన్న చర్చిలో అర్ధరాత్రి పూజలతో వేడుకలు ప్రారంభమయ్యాయి. పశువుల పాక, విద్యుత్ వెలుగులు, శాంటాక్లాస్ వేషదారణ ఆకట్టుకున్నాయి. ఫాదర్లు జాన్సన్ కిస్మస్ ప్రాముఖ్యతను, కీస్తు పుట్టుకను వివరించారు. అనంతరం కేక్ కట్ చేసి వేడుకలు జరుపుకున్నారు. **లక్కిరెడ్డిపల్లి :** ప్రేమ తత్వమే క్రీస్తు సందేశం అని సెయింట్ జోసెఫ్ క్యాథలిక్ చర్చి రెవరెండ్ ఫాదర్ విజయ్ మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని లక్కిరెడ్డిపల్లి సెయింట్ జోసెఫ్ క్యాథలిక్, లూథరన్, మద్దిరేవుల, మిస్పా, ప్రొటెస్టెంట్ సంఘాల చర్చిలలో క్రీస్తు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. క్రైస్తవులకు ప్రధానమైన పండుగ కావడంతో మండలంలోని అన్ని చర్చిలు సర్వాంగ సుందరంగా విద్యుత్ దీపాలతో ముస్తాబయ్యాయి. కార్యక్రమంలో క్రైస్తవ సోదర సోదరీమణులు, భక్తులు పాల్గొన్నారు. **రాయచోటి టౌన్ :** క్రీస్తు బోధనలు అనుసరణీయమని ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని గుణ్ణికుంట్ల క్రాస్ రోడ్డులోని హెబ్రోనా చర్చిలో జరిగిన క్రిస్మస్ వేడుకలలో పాల్గొని కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ ప్రేమ, శాంతి, సంతోషాలుకు ప్రతీక క్రిస్మస్ అని పేర్కొన్నారు. కార్యక్రమంలో కరుణాకర్, నోవాదాస్, బర్న దాస్, మోషే, డేవిడ్ రెడ్డి పాల్గొన్నారు.

రాబోయే ఎన్నికల్లో టిడిపి గెలుపే ధ్యేయం

- పారిశ్రామికవేత్త జయచంద్రారెడ్డి

జయచంద్రారెడ్డికి స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు

ప్రజాశక్తి-ములకలచెరువు/బి.కొత్తకోట

తంబళ్లపల్లె నియోజకవర్గంలో టిడిపి గెలిపే ధ్యేయంగా పనిచేస్తామని ప్రముఖ పారిశ్రామికవేత్త జయచంద్రారెడ్డి అన్నారు. ఆయన సోమవారం నియోజకవర్గంలోని పిటిఎం మండలం బూచిపల్లిలో చెన్నకేశవ స్వామిదేవాలయంలో జయచంద్రారెడ్డి, ఆయన సతీమణి కల్పన, తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, నాయకులతో కలసి పూజలునిర్వహించారు. అనంతరం ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టారు. ఆయనకు బూచిపల్లి గ్రామస్తులు టిడిపి నాయకులు, కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ఏపార్టీ నాయకుడైన ఎన్నికల ప్రచారం మొదలుపెట్టడానికి ఆనవాయితీగా బూచిపల్లి గ్రామం వస్తున్నదని అందుకని తాను కూడా ఇక్కడి నుంచే ప్రచారం మొదలు పెట్టానన్నారు. తంబళ్లపల్లి నియోజకవర్గంలో టిడిపి గెలుపే లక్ష్యంగా పార్టీ కార్యకర్తలను, నాయకులను సమన్వయం చేసుకొని తెలుగుదేశం జెండా ఎగరవేయడమే లక్ష్యంగా పనిచేస్తామన్నారు. ప్రపంచ పటంలో ఆంధ్ర రాష్ట్రాన్ని చూపించినటువంటి ఏకైక విజన్ ఉన్న నాయకుడు చంద్రబాబు అని పేర్కొన్నారు. దేశ విదేశాల్లో తనకున్న యువ పారిశ్రామికవేత్తల పరిచయాలతో తంబళ్ళపల్లి నియోజకవర్గంలో పరిశ్రమలు ఏర్పాటు చేయడానికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు. తంబళ్లపల్లి నియోజకవర్గం వెనుకబడలేదని కొందరు వారి స్వలాభం కోసం వెనక్కు నెట్టేసారని దుయ్యబట్టారు. కర్ణాటక రాష్ట్రానికి సరిహద్దు ప్రాంతంలో తంబళ్ళపపల్లి నియోజకవర్గం ఉందని ఈ ప్రాంతంలో ఉన్న యువత మొత్తం ఉపాధి లేక పొరుగు రాష్ట్రం కర్ణాటకకు అధిక సంఖ్యలో తరలిపోతున్నారని పేర్కొన్నారు. ఈసారి తెలుగుదేశం పార్టీ అధికారంలోకి తీసుకువచ్చి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే కాకుండా పారిశ్రామిక కారిడార్‌గా మారుస్తామని తెలిపారు. అందరూ కలసికట్టుగా తంబళ్ళపల్లిలో తెలుగుదేశం జెండాను ఎగురవేయడానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మార్కిరి ఆంజనేయరెడ్డి, మస్తాన్‌రెడ్డి మాజీ సర్పంచ్‌లు మస్తాన్‌రెడ్డి, కేశవ, కిట్టన్న, రాజన్న, రమేష్, పట్టా చంద్రమోహన్‌రెడ్డి, బీరింగ్ సుబ్బన్న, డాబా రామ్మోహన్, శంకర్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, శంకర, భాస్కర మల్‌రెడ్డి మంజునాథ్, రాజశేఖర్‌రెడ్డి, ఆలయ అర్చకులు పద్మనాభస్వామి, బూర్లపల్లి మాధవరెడ్డి, ఎంఎన్ బయ్యారెడ్డి, చీటికి శివారెడ్డి పాల్గొన్నారు.

బాలోత్సవాన్ని జయప్రదం చేయండి

ప్రజాశక్తి - కడప అర్బన్ : జనవరి 5, 6 తేదీల్లో నిర్వహించే బాలోత్సవం పిల్లల పండుగను జయప్రదం చేయాలని బాలోత్సవ కమిటీ ఉపాధ్యక్షులు డాక్టర్ ఓబుల్ రెడ్డి, కార్యదర్శి బి. లక్ష్మీ రాజా పిలుపునిచ్చారు. సోమవారం శ్రీ హాస్పిటల్లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కడప బాలోత్సవం ఆధ్వర్యంలో పిల్లల పండుగ 28 అకాడమిక్ విభాగాలు, 14 సాంస్కృతిక విభాగాల్లో పిల్లల పండుగ నిర్వహిస్తున్నామని చెప్పారు. పోటీలలో జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ఎయిడెడ్, మున్సిపాలిటీ, ప్రయివేట్, కార్పొరేటు పాఠశాలల విద్యార్థులు పాల్గొనటానికి అవకాశం ఉందన్నారు. కడప బాలోత్సవం ముఖ్య ఉద్దేశం విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మకతను వెలికి తీసుకోవడం కోసం 42 రకాల యాక్టివిటీస్‌లో పాల్గొనడానికి అవకాశం కల్పించామన్నారు. పోటీలలో పాల్గొనదలుచుకున్న పాఠశాల విద్యార్థులు ఈనెల 31 నాటికి దరఖాస్తులు నమోదు చేసుకోవాలన్నారు. పోటీలు మూడు విభాగాలలో ఉంటాయన్నారు. మొదటి విభాగం సబ్ జూనియర్స్, రెండు, మూడు, నాలుగు తరగతులు రెండవ విభాగం జూనియర్స్ ఐదు, ఆరు ఏడు తరగతులు మూడవ విభాగం, సీనియర్స్ ఎనిమిది, తొమ్మిది, పది తరగతుల విద్యార్థులు పాల్గొనటానికి అవకాశం ఉందన్నారు. జిల్లాలోని అన్ని యాజమాన్యాల పాఠశాలల విద్యార్థులు ఈనెల 31లోపు మూడు విభాగాలలో పాల్గొని విద్యార్థులు వారి పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు. దరఖాస్తులు Kadapa baalotsavam@gmail.com పంపాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 8121939351, 9182796052లలో సంప్రదించాలని చెప్పారు. సమావేశంలో కడప బాలోత్సవం కమిటీ సభ్యులు శివరాం పాల్గొన్నారు.

మూడు రోజుల పర్యటనలో ప్రజలకు ముప్పతిప్పలు

ప్రజాశక్తి - కడప అర్బన్ : ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మూడు రోజుల జిల్లా పర్యటనలో ప్రజలు ముప్ప తిప్పలు పడ్డారని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ముడియం.చిన్ని, వీరనాల.శివకుమార్ ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. జిల్లాకు ఒరిగింది శూన్యమని పేర్కొన్నారు. నగరంలో కూడళ్ల ప్రారంభోత్సవం కోసం ట్రాఫిక్ ఆంక్షలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారని తెలిపారు. బస్సుల కోసం ప్రజల ఇబ్బంది పడ్డారని పేర్కొన్నారు. ముఖ్యంగా ప్రజా సంఘాల నాయకులకు ముందస్తు నోటీసులు, అరెస్టులతో నిర్బంధాల నడుమ ముఖ్యమంత్రి పర్యటన సాగిందని తెలిపారు. కనీసం ప్రజా సమస్యలు వినడానికి కూడా అవకాశం లేకుండా పోయిందని పేర్కొన్నారు. ప్రధానంగా కడప ఉక్కు పరిశ్రమ, జిల్లా అభివృద్ధి, అంగన్వాడి సమస్యల పై మాట్లాడకపోవడం దారుణమని తెలిపారు.

చెస్ టోర్నీలో కడప క్రీడాకారుల ప్రతిభ

కడప : నెల్లూరు నగరంలో ఆర్యవైశ్య బులియన్ మర్చంట్ కల్యాణ మండపంలో జరిగిన ఇండియన్ ఓపెన్ ప్రైజ్ మనీ చెస్ టోర్నమెంట్ కడప నగరానికి చెందిన చెస్ క్రీడాకారులు బహుమతులు సాధించారు. అండర్-7 సెవెన్ బాలికల విభాగంలో అమీనా జాతీయ స్థాయిలో రెండవ స్థానం, అండర్ - 19 బాలికల షణ్ముఖ కశ్వి ద్వితీయ స్థానంలో, లక్ష్మీ మనశ్రీ 3వ స్థానంలో నిలిచారు. బెస్ట్ కడప ప్లేయర్స్ ఆఫ్ ది టోర్నమెంట్ విభాగంలో అనీస్ దర్బార్ మొదటి స్థానం, ప్రదీప్ చంద్రారెడ్డి రెండవ స్థానం, ప్రణవ్ రెడ్డి మూడవ స్థానం, అభిరాం రెడ్డి నాలుగవ స్థానం, జతిన్ కుమార్ ఐదవ స్థానం సాధించారు.

వాల్మీకి విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న నాయకులు

వాల్మీకుల ఎస్‌టి బిల్లు పునరుద్ధరించండి

ప్రజాశక్తి-మదనపల్లి

చివరి పార్లమెంట్ సమావేశాలలో వాల్మీకుల పునరుద్ధరణ బిల్లు ప్రస్తావన చేయనందుకు నిరసనగా వాల్మీకి సంఘం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు పులి శ్రీనివాసులు ఆధ్వర్యంలో స్థానిక చిత్తూరు బస్టాండ్ వద్ద వాల్మీకి విగ్రహానికి పాలాభిషేకం చేసి అనంతరం ధర్నా కార్యక్రమం నిర్వహించారు. అనంతరం రాజకీయ నాయకుల వైఖరి పట్ల నిరసన కార్యక్రమాలు తెలియజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ భారతదేశంలో అన్ని రాష్ట్రాలలో వాల్మీకులు ఎస్టీలుగా ఉన్నారని ఆంధ్రప్రదేశ్లో 8 జిల్లాలలో మాత్రంమే బిసిలుగా రాజకీయ దాహానికి బలయ్యారని, రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీల నేతలు వాల్మీకులను మోసం చేశారని వాల్మీకులు 67 సంవత్సరాలుగా న్యాయమైన హక్కు ఎస్టీ పునరుద్ధరణ కోసం పోరాటాలు ఉద్యమాలు చేస్తూ వస్తున్న కాంగ్రెస్, బిజెపి, తెలుగుదేశం, వైసిపి ఎన్నికల ముందు హామీలు ఇచ్చి నెరవేర్చలేదని ధ్వజమెత్తారు, కొన్ని సంవత్సరాలుగా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, మేధావులతో అనేక సభలు సమావేశాలు ఏర్పాటు చేసి అందరి మద్దతు కూడగట్టామని త్వరలో రాబోయే ఎమ్మెల్యే, ఎంపీ ఎన్నికల్లో రాష్ట్రంలో ఉన్న 90 శాతం ప్రజల మద్దతుతో 175 ఎమ్మెల్యే 25 ఎంపీ స్థానాలలో అందరి ఆమోదయోగ్యంతో ఇండిపెండెంట్లుగా ఉమ్మడి అభ్యర్థులను ప్రకటిస్తామని తెలియజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు సద్దల జయసింహ, యువత అధ్యక్షుడు ముఖండ్ల జగదీష్, రెండవ వార్డ్ మహిళా అధ్యక్షురాలు అరవ నిర్మాలమ్మ పాల్గొన్నారు.

అక్రమ తవ్వకాలను పరిశీలిస్తున్న అతికారి దినేష్

అక్రమ తవ్వకాలు వెంటనే ఆపేయాలి : 'అతికారి'

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

కొండలపై అక్రమ తవ్వకాలు, దోపిడీని వైసిపి నాయకులు వెంటనే ఆపివేయాలని జనసేన పార్టీ సమన్వయకర్త అతికారి దినేష్ అన్నారు. సోమవారం ఆయన బాలరాజు పల్లెలోని ఇసుక రీచ్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా దినేష్ మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వంలో కొందరు పెద్దలు అక్రమంగా కొండలు తవ్వి గ్రావెల్ దోపిడీకి పాల్పడుతున్నారని, ఇసుక రీచ్‌లలోనూ రోడ్డు నిర్మాణాల కోసం కొండలను, గుట్టలను యథేచ్ఛగా తవ్వేస్తున్నారని ఆరోపించారు. వైసిపి నేతల అక్రమాలను అడ్డుకోకుండా అధికారులు చూస్తూ ఊరుకోవడం శోచనీయమన్నారు. ఈ ప్రభుత్వంలో చట్టాలు బలహీనుడికి బలంగాను, బలవంతుడికి బలహీనంగాను పనిచేస్తున్నాయని ఎద్దేవా చేశారు. అభివృద్ధి పక్కన పెట్టి దోచుకోవడం, దాచుకోవడమే పరమావధిగా ప్రభుత్వం పనిచేస్తోందని పేర్కొన్నారు. ప్రభుత్వ అక్రమాలు, దౌర్జన్యాలు వెంటనే ఆపివేయాలని లేనిపక్షంలో జనసేన పార్టీ తరపున రోడ్లెక్కి ఉద్యమాలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో జంగిలి ఓబులేసు, గుగ్గిళ్ళ నాగార్జున, వెంకటేష్, గోపికృష్ణ, హేమంత్, ఆనంద్, గణేష్ పాల్గొన్నారు.

నేటి నుంచి 'ఆడుదాం ఆంధ్ర' క్రీడా పోటీలు

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

మండలంలో మంగళవారం నుంచి ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలను నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ శేషగిరిరావు తెలిపారు. మంగళవారం ఉదయం 10 గంటలకు నిమ్మనపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (తెలుగు) క్రీడా మైదానంలో ఈ కార్యక్రమాన్ని అట్టహాసంగా ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 26వ తేదీ నుంచి జనవరి 9వ తేదీ వరకు గ్రామ స్థాయిలో క్రీడా పోటీలను నిర్వహిస్తామన్నారు. ఇక్కడ ప్రతిభ చూపిన వారిని ఎంపిక చేసి జనవరి 10వ తేదీ నుంచి 23వ తేదీ వరకు మండల స్థాయిలో క్రీడా పోటీలను నిర్వహిస్తామన్నారు. ఇప్పటికే గ్రామ సచివాలయాల్లో పేర్లు నమోదు చేసుకున్న క్రీడాకారులు వారి గ్రామాల్లో జరిగే క్రీడలకు హాజరుకావాలని కోరారు. **పుల్లంపేట :** మండల పరిధిలోని క్రీడాకారులను ఉత్తేజిత పరిచేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలు మంగళవారం 15 రోజులు పాటు నిర్వహించబడునని ఎంపిడిఒ రఘురాం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బ్యాడ్మింటన్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, క్రికెట్ క్రీడలో ఆసక్తి కలిగిన క్రీడాకారులు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్నారన్నారు. ఈ క్రీడా పోటీలన్నీ మండల పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానాలలో నిర్వహిస్తామన్నారు. ఈ పోటీలకు ఎంపిపి, జడ్‌టిసి, ఎంపిటిసిలు, సర్పంచులు, పిఇటిలు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, ప్రజలందరూ పాల్గొనవలసిందిగా పేర్కొన్నారు. **బి.కొత్తకోట :** నగర పంచాయతీ పరిధిలోని సచివాలయాలలో స్పోర్ట్స్ ఎంపైర్స్‌కి ఆడదాం ఆంధ్ర క్రీడా సంబరాలు జడ్‌పిహెచ్ఎస్ బాయ్స్ స్కూల్‌లో నిర్వహిస్తున్నట్లు కమిషనర్ పిఆర్ మనోహర్ తెలిపారు. సమిష్టిగా పనిచేసి ఆడుదాం క్రీడలను దిగ్విజయం చేద్దామని నగర పంచాయతీ పరిధిలోని సచివాలయం సిబ్బందికి పిలుపునిచ్చారు.

జగన్ పాలనలో సంక్షేమ విప్లవం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-చిన్నమండెం

సంక్షేమం, అభివృద్ధి, మంచి పనులు చేసినందునే ధైర్యంగా ఓట్లు అడిగే హక్కు వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీకి ఉందని ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. ఈ నెల 28న రాయచోటిలో జరగనున్న బిసి సామాజిక సాధికారిక బస్సు యాత్రను విజయవంతం చేయాలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్ పాలనలోనే సంక్షేమ విప్లవం కొనసాగుతుందని పేర్కొన్నారు. అర్హత ఆధారంగా ప్రతి ఇంటికి సంక్షేమ లబ్ధి అందిందని చెప్పారు. ప్రజలకు సంక్షేమ మంచి పనులు చేశామని తెలిపారు. గత ప్రభుత్వానికి ఈ ప్రభుత్వానికి ప్రజలు తేడా గమనించాలని కోరారు. ఈనెల 28న రాయచోటిలో జరిగే బీసీ సామాజిక సాధికారిక బస్సు యాత్రలో ఎస్సీ, బీసీ మైనారిటీ నేతలు అనిల్ యాదవ్, అంజాద్‌బాష, మేరుగ నాగార్జున, విడుదల రజని, నందిగాం సురేష్ పాల్గొంటారని పేర్కొన్నారు. బస్సు యాత్రను విజయవంతం చేయాలని కోరారు. జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ దేవనాదరెడ్డి మాట్లాడుతూ సమిష్టి కృషితో చిన్నమండెం మండలంలో మెరుగైన మెజారిటీ సాధిద్దామని చెప్పారు. ఎమ్మెల్యే చేసిన సేవలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని పేర్కొన్నారు. వైసిపి వైపు ప్రజలను మరింత మొగ్గు చూపేలా సైనికుల్లా పని చేద్దామని చెప్పారు. చిన్నమండెం మండల వైసిపి నాయకులు, కార్యకర్తలు ఎత్తున ప్రచారం చేయాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, కన్వీనర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు

సమావేశంలో మాట్లాడుతున్న శ్రీకాంత్‌రెడ్డి